క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, సాయంత్రం స్వామికి పల్లకి సేవ నిర్వహించారు.

వైభవంగా పూలంగి సేవ



కోవూరు : కోవూరులో ఉన్న వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి పూలంగి సేవ చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకుడు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో తొలుత అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పూలంగి సేవ, పల్లకిసేవను జరిపించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా మొలకల ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు శ్రీధర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో అర్చకులు సుబ్బయ్యస్వామి, నందకుమార్‌స్వామి, భక్తులు ఉన్నారు.

ప్రత్యేక పూజలు



కోవూరు : కోవూరులోని వీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని మూడేళ్లలోపు పిల్లలకు 300 వెండి డాలర్లను అందజేయనున్నారు. వీటికి సంబంధించి మంగళవారం ఆలయంలో అర్చకుడు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పెద్ది ప్రభావతి జ్ఞాపకార్థం వారి కుమారుడు మారుతీ నాగార్జున, సత్యవతి వీటిని చిన్నారులకు ఉచితంగా అందజేయనున్నారు.

శ్రీవారి కల్యాణం నేడు

నెల్లూరు(బృందావనం) : శ్రావణ నక్షత్రం సందర్భంగా బాలాజీనగర్‌లోని శ్రీసీతారామ స్వామి మందిరంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణం జరుగనుందని మందిర కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. తొలుత ఉదయం 8 గంటలకు స్వామివారికి శాస్త్రోక్తంగా, సాంప్రదాయంగా పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం జరుగనుందని వివరించారు. రాత్రి 8 గంటలకు భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు శ్రీవారి కల్యాణంలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు. కలియుగదైవం కృపకు పాత్రులు కావాలన్నారు.

నూతన పాఠ్యాంశాలపై శిక్షణ



నెల్లూరు(వేదాయపాళెం) : హరనాథపురంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పదో తరగతి నూతన పాఠ్య పుస్తకాలు–అందులోని అంశాలపై రిసోర్స్ పర్సన్‌లకు(ఆర్పీలు) శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీవీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉదయభాస్కర్, కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొందిన ఆర్పీలు జూన్ 23న భౌతికశాస్త్ర, జీవశాస్త్ర, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు నూతన పాఠ్య పుస్తకాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యేందుకు ఈ శిక్షణ దోహదం చేస్తుందన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ నాయకుడు ఎమ్వీ చలపతి, గౌస్‌బాషా, కామయ్య, మస్తానయ్య, జిలానిబాషా, వంశీచరణ్, మారుతీకేశవ్, బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడి డిప్యుటేషన్‌తో ఆస్పత్రి మూత

- ఐదు నెలలుగా ఇదే పరిస్థితి
- ఆయుర్వేద వైద్యుడిని పంపాలని గ్రామస్తుల విజ్ఞప్తి
- కౌంటింగ్ తర్వాత వచ్చే అవకాశం



మూతపడిన విరువూరు ఆయుర్వేద వైద్యశాల

పొదలకూరు : ఐదున్నర దశాబ్దాలుగా గ్రామంలో విశేష సేవలు అందిస్తున్న ఆయుర్వేద వైద్యశాల ఈ ఏడాది జనవరి నుంచి మూతపడింది. ఇక్కడ పని చేస్తున్న ఆయుర్వేద వైద్యుడిని పరిపాలన పరమైన సర్దుబాటుతో డిప్యుటేషన్‌పై మరోచోటుకు పంపడంతో గ్రామస్తులు ఇకనైనా తమ డాక్టర్‌ను తిరిగి పంపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మండలంలోని విరువూరు ఆయుర్వేద వైద్యశాలకు మంచి పేరుంది. ఇక్కడ బెజవాడ గోపాల్‌రెడ్డి చేతుల మీదుగా వైద్యశాలను ప్రారంభించి సేవలు అందిస్తున్నారు. గతంలో వైద్యుల కొరత వల్ల ఇక్కడ సక్రమంగా సేవలు అందేవి కావు. రెండేళ్ల క్రితం ఆయుష్‌లో నియామకాలు జరిగి డాక్టర్ వినోద్‌కుమార్‌ను విరువూరు ఆయుర్వేద వైద్యునిగా నియమించారు. ఫలితంగా వైద్యుడు చిత్తశుద్ధిగా సేవలు అందించి చుట్టుపక్కల గ్రామస్తులకు దగ్గరయ్యారు. తరచుగా ఆయుర్వేద మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ షుగర్, బీపీ పరీక్షలు చేసి మందులను అందజేశారు. అయితే ఈ ఏడాది జనవరిలో డాక్టర్ వినోద్ కుమార్‌ను ముత్తుకూరు మండలం డమ్మాయపాళెం ఆయుర్వేద వైద్యశాలకు డిప్యుటేషన్‌పై పంపారు. అక్కడ వెల్‌నెస్ సెంటరును అభివృద్ధి చేయాలని నిధులు మంజూరు చేశారు. అయితే అక్కడి వైద్యుడు ఉన్నఫళంగా ఉద్యోగానికి రాజీనామా చేయడంతో వినోద్‌కుమార్‌ను నియమించారు. దీంతో విరువూరు ఆయుర్వేద వైద్యశాల మూతపడింది.

ఉత్తమ సేవలు అందిస్తున్న వైద్యశాల

విరువూరు ఆయుర్వేద వైద్యశాల పొదలకూరు మండలంతో పాటు, దగ్గరగా ఉండే చేజర్ల, సంగం, బుచ్చిరెడ్డిపాళెం మండలాల గ్రామస్తులకు కూడా ఉత్తమ సేవలు అందిస్తోంది. వివిధ గ్రామాల నుంచి వచ్చే రోగులు ఆయుర్వేద మందులను తీసుకుని వెళ్తుంటారు. ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని మందుల కోసం నిధులను కూడా పెంచి బయటి రాష్ట్రాల నుంచి తెప్పించడం వల్ల రోగుల సంఖ్య పెరిగింది. కేరళ రాష్ట్రం ఆయుర్వేదానికి ప్రసిద్ధి కావడం వల్ల అక్కడి నుంచి మందులను సరఫరా చేయడం విశేషం. ఉత్తమ సేవలు అందుకుంటున్న ఈ ప్రాంత రోగులకు ఆస్పత్రి మూతపడడంతో ఇబ్బందిగా మారినట్లు వాపోతున్నారు. వెంటనే డాక్టర్ డిప్యుటేషన్‌ను రద్దు చేసి విరువూరుకు పంపాల్సిందిగా కోరుతున్నారు.

డిప్యుటేషన్ రద్దయ్యే అవకాశం



ఎన్నికల కౌంటింగ్ తర్వాత డిప్యుటేషన్ రద్దయ్యే అకాశం ఉంది. తిరిగి విరువూరు ఆయుర్వేద ఆస్పత్రికి వచ్చేందుకు వీలుకలుగుతుంది. కౌంటింగ్ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఆయుష్ మరో 70 మంది వైద్యులను నియమించనున్నట్లు తెలుస్తోంది. డమ్మాయపాళెం ఆయుర్వేద కేంద్రం వెల్‌నెస్ సెంటర్‌గా మారడం, డాక్టర్ లేకపోవడం వల్ల నన్ను డిప్యుటేషన్‌పై పంపారు.

– డాక్టర్ వినోద్‌కుమార్

మహనీయుల చరిత్రతో దేశభక్తి పెంపు



యల్లాయపాళెంలో దేశ నాయకుల వీర గాథలను చదివిస్తున్న గ్రంథాలయాధికారి సురేంద్రరెడ్డి

- గ్రంథాలయాధికారి సురేంద్రరెడ్డి

కొడవలూరు : మహనీయుల చరిత్రలు తెలుసుకోవడం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందుతుందని గ్రంథాలయాధికారి జె.సురేంద్రరెడ్డి తెలిపారు. వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మండలంలోని యల్లాయపాళెం గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం దేశ నాయకుల చరిత్రలను చదివించడంతో పాటు కఠినమైన తెలుగు పదాలను రాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు పెంపొందడంతో పాటు నైతిక విలువలు పెంపొందుతాయని సూచించారు.

కొడవలూరులో..

వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం దేశ నాయకుల వీర గాథలను ల్యాప్‌టాప్‌లో ప్రదర్శించి చూపించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంకయ్య మాట్లాడుతూ విద్యార్థులకు నైతిక విలువలు, సమాజంలో వాటి ఆవశ్యకతను వివరించారు. గ్రంథాలయాధికారిని కె.రాజేశ్వరి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.



కొడవలూరులో దేశ నాయకుల చరిత్రను ల్యాప్‌టాప్‌లో వీక్షిస్తున్న విద్యార్థులు

భూమి సారవంతమైతే సాగు లాభదాయకం



యల్లాయపాళెంలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ లక్ష్మి

కొడవలూరు : భూమి సారవంతంగా ఉంటేనే సాగు లాభదాయకమవుతుందని ఏఓ సీహెచ్‌ఎస్.లక్ష్మి సూచించారు. మండలంలోని యల్లాయపాళెంలో భూసార పరిరక్షణపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు భూసార పరిరక్షణపై దృష్టి సారించకుండా సాగు చేసుకుంటూ పోతే భూమి నిస్సారమై దిగుబడులు గణనీయంగా తగ్గుతాయని చెప్పారు. ఎరువుల ఖర్చు బాగా పెరిగి రైతులు నష్టపోవాల్సి ఉంటుందన్నారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ప్రతి రైతూ విధిగా భూమిని సారవంతం చేసుకోవాలని చెప్పారు. వ్యవసాయశాఖ ద్వారా 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నందున సద్వినియోగం చేసుకుని భూమిని సారవంతం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు జి.ఉమామహేష్, ఒ.సుజిత్, రైతులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులతో దుష్ఫలితాలు



రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారులు

తోటపల్లిగూడూరు : రసాయన ఎరువుల వినియోగంతో భూమికి దుష్ఫలితాలు ఉంటాయని మండల వ్యవసాయాధికారి శిరీషారాణి సూచించారు. మండలంలోని కోడూరు బిట్–1, బిట్–2, ఈదూరు, వరకవిపూడి రైతు భరోసా కేంద్రాల పరిధిలో మంగళవారం సమగ్ర యాజమాన్య పద్ధతులపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ శిరీషారాణి మాట్లాడుతూ అధిక దిగుబడులు సాధించాలంటే సేంద్రియ ఎరువులే శ్రేయస్కరమన్నారు. మట్టి పరీక్షలకు అనుగుణంగా మంచి ఎరువులను ఎంచుకోవాలన్నారు. భూసారాన్ని నశింపజేసే రసాయన ఎరువుల మోతాదును తగ్గించి పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులు వంటి సేంద్రియ ఎరువులను అధికంగా వినియోగించాలన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం రాయితీతో పంపిణీ చేస్తున్న పచ్చిరొట్ట ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ గ్రామ సహాయకులు దయాన, శశి, వైష్ణవి, పలువురు రైతులు పాల్గొన్నారు.

కమనీయం.. సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న దంపతులు

కొడవలూరు : శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి సందర్భంగా మండలంలోని తలమంచి రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి నిర్వహించిన స్వామి అమ్మవార్ల కల్యాణం కమనీయంగా సాగింది. 60 మంది దంపతులు కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమం జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని వీక్షించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఎర్రం మునిరత్నం, మహాలక్ష్మమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

సోమిరెడ్డి.. కరోనా కష్టకాలంలో ఎక్కడికెళ్లావ్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పొదలకూరు : ఎన్నికల ప్రచారంలో పేద ప్రజలకు మానవతా కోణంలో నగదు ఇచ్చానని చెప్పుకునే సోమిరెడ్డి.. కరోనా కష్టకాలంలో ప్రజలు గుర్తుకు రాలేదా? అప్పుడు ఎక్కడికెళ్లావని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ప్రశ్నించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, పార్టీ జిల్లా సేవాదళ్ కార్యదర్శి దాదిబత్తిన విజయభాస్కర్‌రెడ్డి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రలోభాల కేసు నుంచి తప్పించుకునేందుకు సోమిరెడ్డి మానవతా దృక్పథం నాటకం ఆడినట్లు విమర్శించారు. సీనియర్ నాయకుడైన సోమిరెడ్డికి ఎన్నికల నియమావళి గురించి తెలియదంటే హాస్యాస్పదంగా ఉంటుందన్నారు. గిరిజనులకు నేరుగా నగదు అందజేసి దొరికిపోయిన సోమిరెడ్డి.. ప్రస్తుతం ఆ విషయాన్ని నీరు గార్చేందుకు అభివృద్ధిపై మాట్లాడిస్తున్నట్లు తెలిపారు. సర్వేపల్లిలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన అభివృద్ధిపై చర్చకు వస్తే వెల్లడిస్తామన్నారు. టీడీపీ నాయకులు సైకోలుగా మారి ఇష్టానుసారం మాట్లాడుతున్నట్లు తెలిపారు. ఏపీలో చంద్రబాబు అతిపెద్ద సైకోగా మారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని అడ్డుకునే ప్రయత్నం చేసినట్లు, సర్వేపల్లిలో సోమిరెడ్డి సైకోగా మారి కాకాణి చేపట్టిన అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేశాడన్నారు. టీడీపీ నేతలు ఎన్నికల్లో మద్యం, డబ్బులు విచ్చలవిడిగా పంచినట్లు ఆరోపించారు. సమావేశంలో నాయకులు ఎస్కే అంజాద్, జి.వేణుగోపాల్‌రెడ్డి, వాకాటి శివారెడ్డి, వై.వెంకటేశ్వర్లుగౌడ్, ఎస్.శ్రీనివాసులురెడ్డి, యనమల శ్రీనివాసులురెడ్డి, భారతమ్మ, ప్రసాద్, హరి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు అధీనంలో కసుమూరు దర్గా

వెంకటాచలం : దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన కసుమూరు మస్తాన్‌వలీ దర్గా నిర్వహణ మంగళవారం నుంచి వక్ఫ్‌బోర్డ్ పర్యవేక్షణలో జరుగుతుందని వక్ఫ్‌బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్ ఖుదావన్ ఒక ప్రకటనలో తెలిపారు. కసుమూరు మస్తాన్‌వలీ హుండీ, లడ్డూ కౌంటర్, స్నానపు గదులు, చెప్పుల స్టాండ్‌లకు సంబంధించిన వేలం పాటలో దక్కించుకున్న వారి గడువు సోమవారంతో ముగిసిందని తెలియజేశారు. మళ్లీ వేలంపాటలు జరిగేంత వరకు కసుమూరు దర్గా నిర్వహణ వక్ఫ్‌బోర్డ్ ఆధీనంలో ఉంటుందని తెలిపారు.

రెండు సవర్ల బంగారు రికవరీ

ఇందుకూరుపేట : మండలంలోని ఇందుకూరుపేట కో–ఆపరేటివ్ బ్యాంకులో మాయమైన రెండు సవర్ల బంగారు ఆభరణాలు రికవరీ అయినట్లు తెలిసింది. ఓ ఖాతాదారుడు బంగారంపై రుణం తీసుకున్నారు. తిరిగి నగదు చెల్లించేందుకు బ్యాంకుకు రాగా ఆభరణాలు లేకపోవడంతో అంతా అవాక్కయ్యారు. విషయం తెలుసుకున్న బ్యాంక్ చైర్మన్ గునుపాటి సురేష్‌రెడ్డి సంబంధిత సిబ్బందే బాధ్యత అని తేలుస్తూ వారి చేత బంగారాన్ని రికవరీ చేయించి ఖాతాదారునికి చెల్లించినట్లు తెలిసింది.

శాస్త్రోక్తంగా ఏకాంత సేవ

- ముగిసిన బ్రహ్మోత్సవాలు



కోవూరు : మండల కేంద్రమైన కోవూరు గాంధీ పార్క్ సెంటర్‌లో కొలువైన శ్రీకోదండరామ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ ప్రధానార్చకుడు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో ఏకాంత సేవను శాస్త్రోక్తంగా జరిపించారు. తొలుత స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి ఉభయకర్తగా ఆదెమ్మ వ్యవహరించారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

పేదలకు ఆహార ప్యాకెట్ల పంపిణీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని పలు ప్రాంతాల్లో పేదలకు మంగళవారం ఆహార ప్యాకెట్లను అందజేశారు. అమ్మ యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని పెన్నా బ్రిడ్జ్, వెంకటేశ్వరపురం పెన్నా పరీవాహక ప్రాంతాల్లో ఉంటున్న పేద ప్రజలకు భోజన ప్యాకెట్లు అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకుడు రమేష్‌బాబు మాట్లాడుతూ పేదలకు సాయం చేసేందుకు తమ ఫౌండేషన్ సిద్ధంగా ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రీతమ్, చేతన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌పై అపోహలు వద్దు



మాట్లాడుతున్న డాక్టర్ గేయ పూజిత

మనుబోలు : మండల పరిధిలో గత కొన్ని రోజులుగా బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నారని, ప్రజలు భయాలు వీడి వ్యాక్సిన్ వేయించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గేయ పూజిత అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఆమె మంగళవారం మాట్లాడుతూ భవిష్యత్తులో ట్యూబర్కులోసిస్(క్షయ) వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు 18 సంవత్సరాలు నిండిన వారు ఈ వ్యాక్సిన్ వేయించుకోవచ్చని తెలిపారు. ప్రతి గురువారం వైద్య సిబ్బంది అన్ని సచివాలయాల్లో బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నారని తెలియజేశారు. షుగర్ పేషెంట్లు, 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, 18 సంవత్సరాలు పైబడి ఐదేళ్లుగా టీబీతో బాధపడుతున్న వారు, బీఎంఐ 18 కేజీల కన్నా తక్కువ ఉన్న వారు, పొగతాగే అలవాటు ఉన్న వారు తప్పనిసరిగా బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. 18 ఏళ్లలోపు వాళ్లు, హెచ్ఐవీ ఉన్న వారు, గర్భిణులు, హృదయ సంబంధ వ్యాధులున్న వారు, డయాలసిస్, కేన్సర్ పేషెంట్లు, టీబీ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న వారు, క్రానిక్ డిసీజెస్ ఉన్న వారు, మూడు నెలల్లోపు రక్తదానం చేసి ఉన్న వారు వ్యాక్సిన్ వేయించుకునేందుకు అనర్హులని వివరించారు. ఈ వ్యాక్సిన్ వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్‌లు, ప్రమాదాలు ఉండవన్నారు.

కామాక్షితాయి ఆలయంలో వేలంపాటలు



వేలంపాట నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

విడవలూరు : మండలంలోని రామతీర్థం గ్రామంలో కొలువైన రామలింగేశ్వరస్వామి సమేత కామాక్షితాయి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వివిధ అంశాలకు సంబంధించిన వేలంపాటను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ కోవూరు ఇన్‌స్పెక్టర్ చైతన్య మాట్లాడుతూ కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయానికి రూ.1.20 లక్షలకు ఆదిలక్ష్మి అనే మహిళ పాటను దక్కించుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా రంగులరాట్నం నిర్వహణకు రూ.12.45 లక్షలకు చలపతి అనే వ్యక్తి పాటను దక్కించుకున్నట్లు తెలియజేశారు. దీంతో పాటు బ్రహ్మోత్సవాల అనంతరం పూజా సామగ్రి, కొబ్బరికాయల విక్రయానికి రూ.1,62,500లకు రామలింగయ్య అనే వ్యక్తి పాటను దక్కించుకున్నారన్నారు. మరో రెండు వేలం పాటలను వాయిదా వేసినట్లు తెలియజేశారు. బ్రహ్మోత్సవాల్లో ఆలయానికి విద్యుద్దీపాలంకరణకు టెండర్లు నిర్వహించగా శ్రీనాథ్ అనే వ్యక్తి రూ.1.74 లక్షలకు దక్కించుకున్నారన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతరకు చాటింపు



చాటింపు వేస్తున్న కళాకారులు

కొడవలూరు : మండలంలోని కమ్మపాళెంలో పోలేరమ్మ తల్లి జాతరకు చాటింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రతి ఏడాది గ్రామంలో పోలేరమ్మ జాతర అత్యంత వేడుకగా నిర్వహించడం ఆనవాయితీ. చాటింపు కార్యక్రమంతో అమ్మవారి జాతర ప్రారంభించి వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆ తరువాత వచ్చే మంగళవారం అమ్మవారికి అత్యంత ప్రతిష్టాత్మకమైన పొంగళ్ల సమర్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తారు. వచ్చే మంగళవారం జరిగే పొంగళ్ల కార్యక్రమంతో అమ్మవారి జాతర ముగుస్తుందని నిర్వాహకుడు బెల్లం వెంకయ్యనాయుడు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు బెల్లం నగేష్‌నాయుడు, సందీప్‌నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్న అర్చకులు



మూలవిరాట్‌కు అభిషేకం

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అంగరంగ వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమైంది. ఉదయం 7.30 గంటలకు ఆలయ కమిటీ వారు ఉభయకర్తలుగా ఉత్సవ ప్రారంభోత్సవం, సాయంత్రం 7 గంటలకు అంకురార్పణ గావించారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అట్టహాసంగా మారెమ్మ ఉత్సవాలు



అమ్మవారికి సద్దిని సమర్పిస్తున్న మహిళలు

తోటపల్లిగూడూరు : మండలంలోని చిన్నచెరుకూరు గ్రామదేవత మారెమ్మ అమ్మవారి ఉత్సవాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. తొలివారం అమ్మవారికి భక్తులు సద్దిని సమర్పించారు. మూడు మంగళవారాలు సద్ది సమర్పణ, నాలుగో వారం ప్రత్యేక పూజలు, ఐదో వారం ఆలయ ప్రాంగణంలో భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి పొంగళ్లను సమర్పిస్తారు. తొలి వారం జరిగిన సద్ది సమర్పణ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.